



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వసతి గృహాల నిర్వహణపై నివేదికలు ఇవ్వండి

» అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, విద్య, పారిశుధ్యం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం నగరంలోని కొత్తపేట్ విక్టోరియా మెమోరియల్ హోంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమాధికారులు, గురుకులాల ఆర్సీలు, డీసీవోలు, విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వసతి గృహాలను నిర్వహిస్తోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. నాణ్యమైన విద్య, ఆహార వసతి, తరగతి గదుల నిర్వహణ, సాంకేతికతతో సబ్జెక్టుల బోధన అందించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ కార్డును రూపొందించి ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా విధిగా వైద్య పరీక్షలు జరుపుతున్నారా..? లేదా అనేది పరిశీలించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు వారి పరిధిలో ఉన్న వసతి గృహాలను తనిఖీలు చేయాలన్నారు. హాస్టళ్ల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రామారావు, షెడ్యూల్ తెగల జిల్లా సంక్షేమాధికారి రామేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రధానిని కలవడం అదృష్టం

- ప్రపంచ కప్ గెలవడం చాలా సంతోషంగా ఉంది
- మహిళా క్రికెటర్ అరుంధతిరెడ్డి
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు
- అమ్మమ్మ ఆశీర్వాదం తీసుకున్న అరుంధతి

శంషాబాద్‌రూరల్, నవంబర్ 06 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కప్ గెలవడంతో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలవడం అదృష్టంగా భావిస్తున్నానని మహిళా క్రికెటర్ అరుంధతి రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు, స్పోర్ట్ ఆఫ్ అథారిటీ సభ్యులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వన్డే ప్రపంచ కప్ గెలవడం ద్వారా ఇక నుంచి మహిళా క్రికెట్‌కూ ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నానని, గతంలో ఎవరూ పట్టించుకునేవారు కాదన్నారు. ప్రధాని మోదీని జీవితంలో కలుస్తానని కలలో కూడా అనుకోలేదన్నారు. జట్టు సభ్యులు సపోర్టు మరువలేనిదన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చిన తల్లి భాగ్యరెడ్డి, అమ్మమ్మ బాలమణికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకుంది. అనంతరం నగరానికి బయలు దేరి వెళ్లింది.

వాల్టా! పాతర

ఇష్టానుసారంగా బోర్ల తవ్వకాలు

- లాభార్జనే ధ్యేయంగా రెండు మూడు బోర్లు వేస్తున్న భవన నిర్మాణదారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు

భూగర్భ జలాల తవ్వకాలకు నిబంధనలున్నప్పటికీ భవన నిర్మాణదారులు వాటిని పాటించడం లేదు. అనుమతులు తీసుకోకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారం బోర్లు వేస్తున్నారు. బోర్లు వేయడానికి పర్మిషన్ తీసుకోవాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారమని భూగర్భ జలాల పరిరక్షణ కోసం అమలు చేస్తున్న వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఇంటి, వాణిజ్య భవన నిర్మాణదారులు నిబంధనలు అతిక్రమిస్తూ 1000 ఫీట్లకు పైగా బోర్లు తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు

ఆదిభట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా శివారు ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల్లో ఆదిభట్ల ఒకటి. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అంతర్జాతీయ కంపెనీలు టీసీఎస్, ప్యాక్స్ ఖాన్, కేన్స్‌లతో పాటు ఇంజనీరింగ్ కళాశాలలు, కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్ కాలేజీలున్నాయి. దీంతో ఆదిభట్ల, కొంగరకలాన్, మంగల్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, బొంగ్లూర్‌లో ఇంటి నిర్మాణాలతో పాటు వాణిజ్య భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ ఇంటికి, వాణిజ్య భవనానికి బోరు తప్పని సరైంది. దీంతో భూగర్భ జలాల తవ్వకాలకు నిబంధనలున్నప్పటికీ వాటిని సదరు నిర్మాణదారులు పాటించడం లేదు. భూగర్భ జలాల పరిరక్షణలో వీటికి అనుమతి తప్పని సరి. కానీ ఈ తతంగం పూర్తిచేయడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారమని నిబంధనలు అతిక్రమించి 1000 ఫీట్లకు పైగా బోర్లు వేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇస్టానుసారంగా బోర్లు వేయడంతో భవిష్యత్ ప్రమాదాన్ని సూచిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వాల్టా చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూగర్భ జలాలను కాపాడాల్సిన

మిగతా 8వ పేజీలో...



కొంగరకలాన్‌లో వేస్తున్న బోరు



టీసీఎస్ ఎదురుగా ఉన్న ఓ వెంచర్‌లో పక్కపక్కనే వేసిన బోర్లు

స్థానికులకు ఇబ్బందులు..

అంతేగాక, బోర్లు వేసే సమయంలో యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టి బోర్లు వేస్తుండటంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బోరు వేసే సమయంలో పరికరాలు బోరు నుంచి వచ్చే రాయి పౌడర్ మొత్తం పరిసరాల ఇళ్లను కమ్మేయడంతో పాటు బురద నీరు రోడ్లపై పారుతుంది. రాయి పౌడర్ ఇళ్లను కమ్మేయడంతో ఉబ్బసం, అస్తమా తదితర రోగులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో దుమ్ము ధూళి చేరి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నిబంధనలు పాటించి బోర్లు వేసుకోవాలని పట్టణ ప్రజలు అంటున్నారు.

బోర్లపై నియంత్రణ ఉండాలి



కొంతమంది తమ ఇష్టమొచ్చినట్లు 500 అడుగుల నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేస్తూ భూగర్భ జలాలను తవ్వేస్తున్నారు. బిల్డర్స్ లాభార్జన కొరకు ఇష్టానుసారంగా బోర్లు వేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బోర్లు విచ్చలవిడిగా వేస్తున్నారు. అనుమతులు తీసుకొని రూల్స్ ప్రకారం బోర్లు వేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

-నర్పగళ్ల ప్రవీణ్‌కుమార్, కొంగరకలాన్



బుగ్గక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సురేశ్‌మోహన్

భక్తులకు ఇబ్బందులు ఉండొద్దు

» డీఎల్‌పీవో సురేశ్‌మోహన్.. బుగ్గజాతర సందర్శన

మంచాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బుగ్గజాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన బుగ్గరామలింగేశ్వర క్షేత్రాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయ పరిసరాల్లో పారిశుధ్యంపై క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీకనుగుణంగా సిబ్బందిని విధుల్లో నియమించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం సమీప గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఉమారాణి, దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ తదితరులున్నారు.

వైభవంగా సహస్ర చండీయాగం



మైసిగండిలో సహస్ర చండీయాగంలో భక్తులు

- మైసిగండికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు
- 145 మంది వేద పండితులతో యాగం ప్రారంభం
- ఆలయ ఫౌండర్ ట్రస్ట్ శిరోలి పంతు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



రథాన్ని లాగుతున్న భక్తులు

కడ్తాల్/ఆమనగల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో గురువారం సహస్ర చండీయాగం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగే యాగం నేపథ్యంలో మైసమ్మ ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. యాగం కోసం ఆలయ ఫౌండర్ ట్రస్ట్ శిరోలిపంతు, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాధవి దంపతులు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి 145 మంది వేద బ్రాహ్మణులు, అర్చకులు సహస్ర చండీయాగంలో పాల్గొన్నారు. తహసీల్దార్ ఆర్‌పీ జ్యోతి అరుణ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు, యాగాచార్యులు రాధాకృష్ణ శర్మ యాగం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, తులసిరామ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, యాదగిరి, బిచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహదం

సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహదపడతాయని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శీరపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ్మా అన్నారు. కడ్తాల్ మండలం

మిగతా 8వ పేజీలో...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

» డీఎంహెచ్‌వో లలితాదేవి



రికార్డులు పరిశీలిస్తున్న లలితాదేవి

ఆమనగల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పీహెచ్‌సీని కందుకూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతతో కలిసి గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. వైద్యులు షైమున బేగం, మంజులా దేవి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి నాగరాజు, డెంటర్ వైద్యాధికారి జయశ్రీ, నర్సింగ్ ఆఫీసర్‌లతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలో నమోదైన విష జ్వరాల కేసులు, ఓపీ, ఐపీ, గర్భిణి మహిళలకు సంబంధించిన రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ట్రామా కేర్, గర్భిణీల డెలివరీకి, ఎంసీహెచ్, ప్రమాదాలకు గురైన వారికి చేసిన చికిత్సలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి అక్రమ్, డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ షైమునబేగం, వైద్యులు మంజుల దేవి, నాగరాజు, డెంటల్ వైద్యాధికారిణి జయశ్రీ, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, హెడ్ నర్స్ ఏసుమణి, నర్సింగ్ ఆఫీసర్లు సునీత, దేవేందర్, సాయిలక్ష్మి, కృష్ణలీల, మధు, ఫార్మాసిస్టు ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ వేణు, వైద్య సిబ్బంది మునీర, గోపాల్‌రెడ్డి, హనుమంతు, గుజ్జరి శ్రీను, సురేశ్, మంగ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్



సీఐటీయూ నాయకులతో జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్

శంకర్‌పల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ కోరారు. శంకర్‌పల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10, 11 తేదీలలో రాజేంద్రనగర్‌లోని కాటేదాన్‌లో మహాసభలు జరగనున్నాయని, కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శంకర్‌పల్లి మండల సీఐటీయూ కన్వీనర్‌గా బోడ మల్లేషంను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మల్లేషం మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమేష్, సత్యం, మోహన్, శ్రీకాంత్, నర్సింలు, మానయ్య, జంగయ్య ఉన్నారు.



మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ

7

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర

7

మొక్కజొన్నలు కొనరా..?



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎదురుచూపు
- పంట నూర్పిళ్లు చేసి కల్లాల్లో ఆరబోత
- ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలంటున్న రైతులు
- అదును చూసి దోచేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ట్రాక్టర్‌లోని మొక్కజొన్నలను ఆరబోస్తున్న దృశ్యం

చేవెళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. కానీ మొక్కజొన్న కొనుగోళ్లపై మాత్రం ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. చేవెళ్ల డివిజన్‌లో వేలాది ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా వానాకాలం పంట చేతికొచ్చింది. కానీ కొనుగోలు కేంద్రాలను ఇంకా ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. వానాకాలం సాగులో రైతులు పండించిన మొక్కజొన్న పంటలు చేతికొచ్చాయి. దీంతో రైతులు చాలా మంది యంత్రాలు, కూలీలతో మొక్కజొన్నలను పొలాల నుంచి తీయిస్తున్నారు. చాలా మంది రైతులు వ్యవసాయ

మిగతా 8వ పేజీలో...

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నాం. పంట కోసి నేరుగా చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌యార్డుకి తీసుకు వచ్చి మూడు రోజులుగా ఎండబెట్టాను. మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఆలస్యం చేయకుండా ప్రభుత్వ కొనుగోలు చేయాలి.

చాకలి యాదయ్య, రైతు చేవెళ్ల

ఓటరు జాబితా పరిశీలన

దుద్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలు సమమావేశమయ్యారు. ఓటరు జాబితాను పరిశీలించారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. బీఎల్‌వోలు సరి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉశప్ప, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని విమర్శించే అర్హత కార్తీక్‌రెడ్డికి లేదు

- చేవెళ్లలో దశాబ్దాలపాటు పట్లోళ్ల కుటుంబం పాలన
- అభివృద్ధి శూన్యం : మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రత్నం

చేవెళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వార్డు మెంబర్‌గానైనా గెలవని పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఇష్టానుసారం విమర్శించే నైతిక అర్హత లేదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. గురువారం చేవెళ్లలో బీజేపీ నాయకులతో కలిసి రత్నం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు చేవెళ్ల నియోజకవర్గాన్ని పట్లోళ్ల కుటుంబమే పాలించి అభివృద్ధి మాత్రం చేయలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి తెచ్చిందే ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అని చెప్పారు. పంచాయతీ వార్డు మెంబర్‌గానైన గెలువని బీఆర్‌ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి తన ఇష్టం వచ్చినట్టు స్థాయికి మించి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిపై ఏకవచనంతో సంబోధిస్తూ మాట్లాడటం అనైతికం అన్నారు. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో ఎంపీ మాట్లాడిన మాటలను కార్తీక్‌రెడ్డి వక్రీకరిస్తూ తనకు అనుకూలంగా మాట్లాడి అతి తెలివి ప్రదర్శించాడన్నారు. ప్రాణహిత మొబిలైజేషన్ పేరుతో రూ.800కోట్లు దిగమింగారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి చేవెళ్ల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇక్కడ ఆర్టీసీ డిపో, జూనియర్ కళాశాల లేవన్నారు. చేవెళ్ల సెంటిమెంట్‌ను వాడుకొని వారి కుటుంబం లబ్ధిపొందిందని, ఇక్కడి ప్రాంతం వారికి రాజకీయ భిక్ష పెట్టిందన్నారు. కేటీఆర్ మెప్పు కోసమే కార్తీక్‌రెడ్డి ఎంపీపై స్థాయికి మించి విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే యాదయ్య జీవో111 ఎత్తివేయిస్తానని అని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్న మచ్చలేని నాయకుడు విశ్వేశ్వర్‌రెడ్డి ఒక్కడే అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఈ నియోజవర్గానికి చేసిందేమీ లేదని, హైదరాబాద్- బీజాపూర్ రోడ్డుకు నిధులు తానే తెచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటూ ఫొటోలు, వీడియోలు దిగుతూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్గారి వైభవ్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, జైశంకర్, వెంకట్రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, గాలయ్య, అభిషేక్‌రెడ్డి, అశోక్, కరుణాకర్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, గణేశ్ ఉన్నారు.

భూములిచ్చే రైతులకు పరిహారం, ఇంటి స్థలం

కందుకూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి):టీజీఐఐసీకి భూములు ఇచ్చే ప్రతీ రైతుకు పరిహారంతో పాటు ఇంటి స్థలం కేటాయిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. నాగిరెడ్డిపల్లిలో 198ఎకరాల్లో ప్రభుత్వం ఐటీ పార్కును ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇందుకు 94 మంది రైతుల నుంచి సేకరించే భూములకు మార్కెట్ రేట్ ప్రకారం ఎకరాకు రూ.1.1కోట్లతో పాటు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసే వెంచర్‌లో ప్రతీ ఎకరం భూమికి 121గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో ఐఐసీ జోనల్ మేనేజర్ గణేష్, మహేశ్వరం తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, కార్యాలయ డీటీ రాజు, మహేశ్వరం ఆర్ఐ స్వర్ణకుమారి, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల చైర్‌పర్సన్లను
కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఒబేదుల్లా కొత్వాల్, రాంరెడ్డితో గుర్రం కేశవులు

ఆమనగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలను కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు ఉపాధి కల్పనకు తోడ్పాటును అందించాలని, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. శ్రీనివాస్, పుల్లయ్య, రవికుమార్, శేఖర్, సుభాష్, మనోహర్, లక్ష్మయ్య, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.

కల్వ సుజాతను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

తలకొండపల్లి: మండల కాంగ్రెస్ నాయకులు గురువారం రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతను కలిశారు. హైదరాబాద్‌లో సుజాతను కలిసి సత్కరించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి, ఉపాధికి కార్పొరేషన్ తోడ్పాటునందించాలని కోరినట్లు నాయకులు పేర్కొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతశ్రీ, ఎస్సై మహేందర్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, డ్రగ్స్‌కు బానిసైతే జీవితం నాశనమేనని మహేశ్వరం సీడీపీవో శాంతశ్రీ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గూడూరు గేటు వద్ద గల బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు విద్యతో పాటు క్రీడారంగాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలనకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు అలవాటైతే జీవితం అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో గూడూరు మెడికల్ ఆఫీసర్ సంధ్య, అంగన్‌వాడీ సూపర్వైజర్ ఇందిర, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీకిరణ్, టీచర్లు, అంగన్‌వాడీలు యశోద, సుమతి, దీప, బాలికలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేఎల్ఎం మృతి

» లారీ-బైక్ ఢీకొనడంతో దుర్మరణం



ముజాహిద్(ఫైల్)

మంచాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి ఆగాపల్లి-సాగర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్ దుర్మరణం చెందాడు. ఎస్సై వంశీ తెలిపిన వివరాల మేరకు.. యాచారం మండలం మేడిపల్లికి చెందిన మహమ్మద్ ముజాహిద్(26) కొత్తూరులో ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ముజాహిద్ బుధవారం విధులు ముగించుకొని రాత్రి 10గంటల సమయంలో తన బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఆగాపల్లి చౌరస్తా వద్ద ఎదురుగా.. ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న లారీ(ఆర్‌జే11 జీబీ4402) బైక్‌ను ఢీకొట్టింది. లారీ ముందు టైరు ముజాహిద్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముజాహిద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ తెలిపారు.

టీడీఎఫ్ నాయకులపై కేసులు హేయం



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం నాయకులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. చేవెళ్ల బస్సు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృతి చెందడం బాధాకరం అన్నారు. రోడ్లు బాగలేకే ఎంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వ తీరుకు నిరసనగా తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం నాయకులు ఆందోళన చేశారన్నారు. వారిపై పోలీసులు కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గత మంగళవారం తాండూరు విలియమూన్ చౌరస్తా వద్ద ధర్నాలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. వెంటనే కేసులను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

» నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ గుర్తింపు

» టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సిములు



కొడంగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదల కోసం అందిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సిములు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 27సంవత్సరాలుగా విద్య, వైద్యపరంగా సేవలు అందిస్తున్నారన్నారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో 2017లో మెగా శిబిరం నిర్వహించి 129 మంది రైతులకు రూ.78లక్షల చెక్కులను అందించినట్లు గుర్తుచేశారు. పశువులకు వైద్య చికిత్సలు అందిస్తూ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయి గోల్డెన్ పికాక్ అవార్డును నారా భువనేశ్వరి అందుకోనున్నారని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ ఆదర్శ నేతగా గుర్తింపు పొందితే.. ఆయన సతీమణి భువనేశ్వరి సామాజిక సేవలకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయం అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సన్నద్ధం

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర కల్పించడానికి ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఏపీవో పి.నరేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం రూ.2,369 చొప్పున చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేవీవీ పోస్టర్ ఆవిష్కరణ

మాడ్గుల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవన పద్ధతులు, ఆచార వ్యవహారాలు, సైన్స్‌తోనే జీవన మనుగడ సాగుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, ఇర్విన్ ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు అన్నారు. ఈ మేరకు ఇర్విన్ జెడ్పీ పాఠశాలలో గురువారం తెలంగాణ ప్రభుత్వం జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రతీయేటా నిర్వహించే చెకుముకి సంబరాలు-2025 వాల్‌పోస్టర్లను ఎంఈవో సర్దార్‌నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రపంచంలో చాలా దేశాలు సైన్స్ ఆధారంగా ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నాయని అన్నారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

దుద్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీశాట్ ద్వారా ఎంపిక చేసిన తేదీల్లో విద్యార్థులు నైతిక విలువలతో కూడిన పాఠాలపై ప్రసారం చేస్తున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, మల్లప్ప, రాములు, రవినాయక్, ముకుందరెడ్డి, శ్రీనివాసులు, సాలిబాయి, తదితరులు పాల్గొన్నారు.

మీర్జాగూడ ప్రమాద బాధిత
కుటుంబాలను ఆదుకుంటాం

» చెక్కులు అందజేసిన చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

» రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచన



మృతుల కుటుంబాలను ఓదార్చి ఆర్థికసాయం అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్సు-కంకర టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19మంది మృతిచెందగా, 21 మంది గాయాలపాలైన విషయం తెలసిందే. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి గురువారం తాండూరులో పర్యటించి 13మంది మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇందిరమ్మ కాలనీలోని సాహెల్, ఖాలీద్‌లతో పాటు రెండు నెలల శిశువు కుటుంబానికి, వాల్మీకి కాలనీ ఉండే వెంకటమ్మ, విశ్వంభర(బృందావనం) కాలనీలో తబస్సుమ్, గౌతాపూర్‌లో ఉండే ముస్కాన్ బేగం, పాత తాండూరులోని దస్తగిరి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన రూ.7లక్షలకు అదనంగా తన సొంతంగా ఒక్కో కుటుంబానికి రూ. 20వేల సాయాన్ని అందించారు. యాలాల మండలం పేర్కంపల్లికి చెందిన ఎల్లయ్యగౌడ్ ముగ్గురు కూతుళ్ల మరణంపై మహేందర్‌రెడ్డి కలత చెందారు. ఎల్లయ్యగౌడ్ కుటుంబంతో పాటు లక్ష్మీనారాయణపూర్‌నకు చెందిన అఖిల, హాజీపూర్ వాసులు బందెప్ప, లక్ష్మి దంపతుల కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని తబస్సుం కుటుంబీకులకు హామీ ఇచ్చారు.

మానవ తప్పిదాలవల్లే ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు చాలా వరకు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మీర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదం, అలాగే గతంలో ఆలూరు రోడ్డు ప్రమాదం వంటివన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, మితి మీరిన వేగం వల్లే జరిగాయని అన్నారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు వైడెనింగ్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ సమస్య పరిష్కారమై పనులు చేపట్టాలనుకుంటున్న తరుణంలో ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరం అన్నారు. తాను మంత్రిగా ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేశామని, బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. వికారాబాద్-తాండూరు రోడ్డుకు సైతం నిధులు ఇచ్చి, పనులు చేయించానని, తన ఓటమి తర్వాత ఆ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల సీఎం చొరవతో ఈ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సమన్వయ కర్త కరుణం పురుషోత్తంరావు, నాయకులు సిద్రాల శ్రీనివాస్, రవీందర్, రఘు, అబ్దుల్ ఘని, భగవాన్, సంకేత్, సిద్ధు తదితరులు ఉన్నారు.

రోడ్లను బాగుచేయండి మహాప్రభో ...

● పలు గ్రామాల ప్రజల నిరసన ర్యాలీ



మేడిపల్లికలాన్-చిట్టంపల్లి గేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

పూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్లకు మరమ్మతులు, నూతన నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. గురువారం పూడూరు మండలం మేడిపల్లికలాన్ నుంచి చిట్టంపల్లి గేటు వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు మాట్లాడుతూ.. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోనూ రోడ్లు సరిగ్గా లేక ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు సరిగ్గా లేకే తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నాయన్నారు. కొన్నేళ్లుగా ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల పరిధిలోని ప్రధాన, గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. అధికారులు స్పందించి కొత్తగా రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చీఫ్ విప్ పరామర్శ



జగదీశ్ పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్న మహేందర్‌రెడ్డి

వికారాబాద్/తాండూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చంద్రవంచ వద్ద ఆటో ప్రమాదంలో గాయపడి వికారాబాద్‌లోని ఈశ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జగదీశ్‌ను గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. జగదీశ్ ఆరోగ్య స్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మహేందర్‌రెడ్డితో పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు రత్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, పి.సాయిరెడ్డి, అశోక్, శేఖర్, యువకుడి సోదరుడు ప్రశాంత్ ఉన్నారు.

బస్సు ప్రమాద మృతుడి
కుటుంబానికి ఆర్థికసాయం



హన్మంతు భార్యకు చెక్కును అందజేస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చేవేళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మండలంలోని నీటూర్‌కు చెందిన మల్లగల్ల హన్మంతు మృతిచెందాడు. ప్రభుత్వం తరఫున అతడి కుటుంబానికి మంజూరైన ఆర్థిక సహాయం రూ.7లక్షల చెక్కును గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేశ్‌కుమార్‌లు స్థానిక నాయకులతో కలిసి హన్మంతు భార్య కాశమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకట్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి
ప్రభుత్వం సానుకూలం

» తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

» పొద్దుటూర్‌లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం

శంకర్‌పల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఐజేయూ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొద్దటూర్‌లో గల ఓ రిసార్ట్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్‌అలీ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాస్‌రెడ్డితో జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వంతో చర్చించినట్లు చెప్పారు. 2026 ఫిబ్రవరి మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయు) ప్లీనరీ విజయవంతానికి సన్నాహాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా జనవరిలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సమస్యలను విస్మరిస్తే ఆందోళనలే ...

ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే ఆందోళనలు తప్పవని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చి రెండేళ్లు అవుతున్నా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదంది. ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రిడిటేషన్ల జారీని త్వరగా పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ గెలుపునకు కృషిచేసిన విరాహత్ అలీని, నాయకులను అభినందించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన 16మంది జర్నలిస్టులకు నివాళులు అర్పించారు. సమావేశంలో ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు సత్యనారాయణ, మాజిద్, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కిషన్, సంపత్‌కుమార్, సలీంపాషా, మధుగౌడ్, ఎం.వెంకట్‌రెడ్డి, యూసుఫ్, బాబు, అశోక్, యాదయ్య, మల్లికార్జున్, జిలానిపాషా పాల్గొన్నారు.



శివకుమార్‌ను అభినందిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా శివకుమార్

తాండూరు: టీయూడబ్ల్యూజే-ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కుల్కచర్ల శివకుమార్ ఎంపికయ్యారు. ఆయనను యూనియన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఎంపికచేశారు. శివకుమార్‌ను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే నాయకులు అభినందించారు.

బీఆర్ఎస్, బీజేపీలను
నమ్మి మోసపోవద్దు



ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాజకీయాల లబ్ధికి కుట్ర చేస్తున్నాయని, వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాడుగుల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండగల్‌రెడ్డిలు అన్నారు. వారికి ప్రజలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు, మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడలో ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికేదైనా విజయం కాంగ్రెస్‌దే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు గుర్రం కేశవులు, యాట నర్సింహ, జక్కు అనంతరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మహేందర్, యాదయ్య, డేవిడ్, కృష్ణ, మంగ్లీ రాములు, రమేశ్, జగన్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, ఫరీద్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం



ఎన్నికల ప్రచారంలో భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ ఉప ఉన్నిక ప్రచారంలో ఆయన సోమాజీగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చేస్తున్న, చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు మద్దతుగా నవీన్‌యాదవ్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల తరహాలోనే ఇప్పుడు కూడా బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటై కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్నాయని, కుమ్మక్కు రాజకీయాలు ఎన్ని చేసినా కాంగ్రెస్‌దే విజయ అని దేప ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఎక్కువ కేసుల్లో రాజీపడేలా చేయాలి

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీపడేలా న్యాయవాదులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మేడియేషన్ యాక్ట్ 2023 ప్రకారం కోర్టు ఆవరణలో చేపడుతున్న కార్యక్రమాలు స్వచ్ఛందంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శాంతిలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బస్వారాజ్, శంకరయ్య, వెంకట్ రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతర పార్కింగ్‌కు నేడు వేలం

ధారూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 11వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించే ధారూరు మెథడిస్టు జాతరకు వాహనాల పార్కింగ్‌నకు నేడు (7వ తేదీన) వేలం నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్టేషన్ ధారూరు, దోర్నాల గ్రామ పంచాయతీల ఆవరణలో వేర్వేరుగా వాహనాల పార్కింగ్‌లకు వేలం జరుగుతుందని చెప్పారు. ఇందులో పాల్గొనే వారు స్టేషన్ ధారూరులో రూ.2వేలు, దోర్నాల్‌లో రూ.5 వేలు నగదు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు, వారి కుటుంబ సభ్యులు పంచాయతీలలో ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. పార్కింగ్‌కు దక్కించుకున్న వారు ద్విచక్ర వాహనాలకు రూ.50, నాలుగు చక్రాల వాహనాలకు రూ.100 చొప్పున వసూలు చేసుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

కనుల పండువగా సీతారాములు..
శివపార్వతుల కల్యాణం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సీతారాముల, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శావపై స్వామివార్లను ఊరేగించారు. అనంతరం ఆలయ అవరణలో సీతారాములు, శివపార్వతుల మూర్తులకు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రమాదేవి, ధ్వజస్తంభ దాతలు శ్రీనాథ్‌రావు, రాజలింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీతారాములు, శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు



కళాశాలలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శంషాబాద్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర సూచించారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా గురువారం వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన డీసీపీ మాట్లాడుతూ... గుర్తుతెలియని వ్యక్తులు బంధువుల, పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు వేయాలని కోరితే స్పందించొద్దన్నారు. ఎవరైనా ఏ విషయంలోనైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు బలికావొద్దని సూచించారు. సోషల్‌మీడియాలో వచ్చే ప్రకటనలకు స్పందించొద్దని చెప్పారు. ఈ మేరకు అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, దుర్గాప్రసాద్, ఎస్సై సాదత్ అలీ పాల్గొన్నారు.

దీపాలు వెలిగిస్తుండగా
అంటుకున్న నిప్పు

» చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కీసర రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దీపాలు వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఏడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన గురువారం కీసర మేడ్చల్ జిల్లా మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి నాగారం మున్సిపాలిటీ ఆర్ఎల్‌నగర్‌కాలనీ, రెక్వెల్‌ఫోర్ట్ స్కూల్ సమీపంలో కుటుంబంతో ఉంటున్నాడు. కార్తీక పౌర్ణమి నాడు బుధవారం ఇంటి కుటుంబ సభ్యులు దీపాలు వెలిగిస్తున్నారు. ప్రమాదవశాత్తు తన కుమార్తె సాయినేహారెడ్డి(7)కి నిప్పంటుకుంది. గమనించిన తల్లితండ్రులు చిన్నారిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. 90శాతం కాలడంతో పరిస్థితి విషమించి బాలిక చనిపోయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీఐలు, ఇన్‌స్పెక్టర్లు
- ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



షాబాద్: అవగాహన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఉపాధ్యాయులు

కేశంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నరహరి సూచించారు. సైబర్ జాగృక్త దివస్‌ను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంతో పాటు కొత్తపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఆన్‌లైన్‌లో ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే డయల్-1930కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మోసాలను గుర్తించాలి

ఆమనగల్లు : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీతారాంరెడ్డి, ఏఎస్ఐ రాంరెడ్డి సూచించారు. సెల్‌ఫోన్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఏదో ఒక ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

కొత్తూర్ : సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఇన్‌స్పెక్టర్ హాజరై మాట్లాడారు. నకిలీ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు రూపొందించి మోసానికి పాల్పడుతుంటారని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంఈవో అంగోర్‌నాయక్, ఎస్ఐలు సత్యశీలారెడ్డి, గోపాలకృష్ణ, టీచర్లు, విద్యార్థులున్నారు.



కేశంపేట : మాట్లాడుతున్న సీఐ నరహరి

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

షాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ కంట్రోల్, చట్టాలపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, బాధ్యతతో వ్యవహరిస్తూ చదువుపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్సై రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తూర్ : అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

క్రైం కార్నర్

అక్రమంగా మట్టి తవ్వకాలు

- రెండు టిప్పర్లు, హిటాచీ సీజ్.. కేసు నమోదు

కొందుర్గు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టగా కేసు నమోదైన ఘటన కొందుర్గు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రం శివారులోని కేజీబీవీ వసతిగృహం సమీపంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో తహసీల్దార్ ఆజంఅలీ ఆదేశానుసారం జీపీవో కావలి హరీశ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. ఈమేరకు రెండు టిప్పర్లు(టీఎస్ 07 యూఎల్ 1198, టీఎస్ 07 యూఎం 8289) ఒక హిటాచీ వెహికిల్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఆర్‌జీఐఏ సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. ఏపీలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన పూర్ణచందర్‌రావు(29) నెల రోజుల క్రితం భార్య ప్రసన్న, కూతురితో కలిసి శంషాబాద్‌కు వచ్చి ఆర్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో భార్యతో గొడవపడిన పూర్ణచందర్‌రావు ఇంటి తలుపులు వేసుకొని ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాలు ధ్వంసం

యాచారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చి చూసేసరికి మూడు చోట్ల ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి వైర్లను కత్తిరించి ఉన్నాయి. కాగా, ఈ సంఘటనతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురుగు కాలువను తొలగించండి

కేశంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంతాపూర్ ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య నుంచి తీసిన మురుగు కాలువను తొలగించాలని కాలనీవాసులు గురువారం ఎంపీవో కిష్టయ్యకు వినతిపత్రం అందించారు. నల్ల చెరువు, కోళ్లఫామ్, సమాధుల మీదుగా వచ్చే మురుగు నీటిని కాలనీ మీదుగా వెళ్లేందుకు ఇటీవల గ్రామానికి చెందిన కర్రెడ్ల ప్రభాకర్‌రెడ్డి కాలువ తీశారని తెలిపారు. మురుగు నీరు పారుతుండడంతో ఈగలు, దోమల బెడదతో పాటు దుర్వాసన వస్తుందని, మురుగు కాలనీ మీదుగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీటీసీ రాజు, సుధాకర్, కేశవులు, సాయిలు, రాజు, నరేందర్, సాయికుమార్, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలు కొనరా..?

(ఐదో పేజీ తరువాయి)

మార్కెట్ యార్డుల్లో మొక్కజొన్నలను ఎండకు ఆరబోసి ఉంచారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్నలు క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,225గా నిర్ణయించింది. ఈ ఏడాది వానాకాలంలో చేవెళ్ల మండలంలో 1500 ఎకరాల్లో రైతులు మొక్కలు సాగు చేశారు. అలాగే షాబాద్ మండలంలో 3220 ఎకరాలు, మొయినాబాద్ మండలంలో 227 ఎకరాలు, శంకర్‌పల్లి మండలంలో 1459 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే పంట చేతికొచ్చినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో మక్కలను ఎక్కడ అమ్మాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. విధిలేక ప్రైవేట్ వ్యాపారులు ఆశ్రయించి తక్కువ ధరకే మక్కలను విక్రయించి మోసపోతున్నారు. గతేడాది కంటే ఈసారి మొక్కజొన్న పంట దిగుబడి చాలా వరకు పెరిగిందని రైతులు చెబుతున్నారు. తక్షణమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలతో కొంత నష్టం

మొదట్లో బాగానే ఉన్నప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్నకు కొంతవరకు నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. వానలు రాకుంటే దిగుబడి మరింత ఎక్కువగా ఉండేదంటున్నారు. ఎకరాకు 6 క్వింటాళ్ల వరకు పంట వస్తుందని వివరిస్తున్నారు.

వైభవంగా సహస్ర చండీయాగం

(ఐదో పేజీ తరువాయి)

మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని గురువారం వారు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయంలో కమిషనర్ హరీశ్ దంపతుల పూజలు

కడ్తాల్ : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హరీశ్ గురువారం రాత్రి కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆలయానికి వచ్చిన హరీశ్ దంపతులకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన సహస్ర చండీయాగంలో పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

మైసిగండి ఆలయంలో గురువారం రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలిపంతు, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో రథాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి భక్తులు తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ గంగాధర్, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాల్టా.. పల్టా!

(ఐదో పేజీ తరువాయి)

బాధ్యత ఉన్నప్పటికీ బోర్ల తవ్వకాలను పట్టించుకోకపోవడంతో వాణిజ్య వ్యాపారులు, ఇంటి నిర్మాణదారులు ఇష్టానుసారంగా బోర్లు తవ్వుతున్నారు.

వాణిజ్య భవనాలతో సమస్యలు

గతంలో 200 నుంచి 300 అడుగుల వరకు బోర్లు వేసేవారు. భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో ఇవి సరిపోయేవి. ప్రస్తుతం వాణిజ్య భవనాలతో పాటు, కొత్త కాలనీలు, హాస్టళ్ల భవనాలు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలు చేపట్టేవారే అధికంగా ఉన్నారు. కొన్ని కాలనీల్లో 200 గజాల్లోనే రెండు, మూడు అంతస్తుల భవనాలు నిర్మిస్తూ మూడు, నాలుగు బోర్లు వేస్తున్నారు. అంతర్జాతీయ కంపెనీలు ఉండటంతో హాస్టళ్లకు, అద్దె భవనాలకు డిమాండ్ బాగా ఉంది. వాటిల్లో జనం ఎక్కువగా ఉండటంతో నీరు సరిపోవడం లేదు. దాంతో హాస్టళ్ల నిర్మాణదారులు, ఇంటి యజమానులు 500 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేస్తున్నారు. ఆదిభట్ల, మంగల్‌పల్లిలో 2నెలల వ్యవధిలో వందల బోర్లు వేసినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం 400 గజాల స్థలంలో నాలుగు బోర్లు వేశారు. నిబంధనలకు మించి బోర్లు వేస్తుండటంతో వాల్టా చట్టం ప్రశ్నార్థకంగా మారింది. కాగా, ఇప్పటికైనా అధికారులు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ఘనంగా సదర్

కడ్తాల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో సదర్ సంబరాలు అంబురాన్నంటాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గ్రామస్థులు, నాయకులు, యాదవ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక యాదవ సంఘం నాయకుడు శివయాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. దున్నపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ కుల దైవాలకు యాదవ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవుల సంప్రదాయ పండగ సదర్ అని జైపాల్ యాదవ్ అన్నారు. యాదవ కులస్తులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కడారి రామకృష్ణ, పరమేశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ యాదయ్య, శ్రీకాంత్, రాజేందర్, నరేశ్, భాస్కర్, శ్రీను, శ్రీశైలం, వెంకటేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు

ఉప ఎన్నిక.. జోరుగా ప్రచారం



కొత్తూర్ : ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మోసాల కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్, కొత్తూర్ మున్సిపాలిటీలతో పాటు, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులతో కలిసి ఆయన ఆధ్వర్యంలో నగరంలోని రహమత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పర్చడాన్ని గుర్తుచేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోసాల కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలని అంజయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొందూటి నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్, డోలీ రవీందర్, కోస్గి శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పాలకుర్ల అద్దాల రాములు అన్నారు. కడ్తాల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లతో అభ్యర్థించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, ఆలంపల్లి యాదయ్య, ఇమ్రాన్ బాబా, రాంచందర్ నాయక్, మల్లేశ్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్న జంగారెడ్డి

కందుకూరు : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. గురువారం ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాను సారం నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు బోధ పాండు రంగారెడ్డి, డిల్లీ శ్రీధర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, గాదె కుమార్, ఎండీ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్' భూమిలో మైనింగ్‌కు అనుమతులివ్వొద్దు

కేశంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం గ్రామ శివారులో గల సర్వే నెంబర్-20లో వక్ఫ్ బోర్డు భూమి ఉందని.. ఇందులో మైనింగ్ చేయడానికి ప్రభుత్వ అనుమతుల కోసం కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి పర్మిషన్ అస్సలు ఇవ్వొద్దని గ్రామానికి చెందిన సలీం, షకీల్ అనే యువకులు గురువారం తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సర్వేనెంబర్-20.. వక్ఫ్ గెజిట్ సీరియల్ నెంబర్ 31378గా నమోదై ఉందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కావలి పెద్దమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం మృతురాలి కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేల ఆర్థికసాయాన్ని ట్రస్టు సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి అందించారు. అశోక్‌గౌడ్, ఏదుల రాజు, కావలి కృష్ణ, ఏదుల మహేశ్, తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

కడ్తాల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య కడ్తాల్‌లో మహిళా సమాఖ్య, గ్రామ సంఘాల ఈసీ సభ్యులకు రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. గురువారం సెర్ప్ కార్యక్రమాలపై చర్చించారు. గ్రామ సంఘాల సబ్ కమిటీల ఏర్పాటు, పనితీరు, సామాజిక పెట్టుబడి, నిధి రికవరీ, రుణాల మంజూరు, తదితరాలపై చర్చించారు. లీలాకుమారి, ఏపీయం రాములు, సమాఖ్య అధ్యక్షురాలు కుమార్తె, కార్యదర్శి పుష్పలత, కోషాధికారి వరలక్ష్మి, సుజాత తదితరులున్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫీజు బకాయిలు చెల్లించాలి

శంషాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్స్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రణయ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం కమిటీలు వేసి కాలయాపన చేయకుండా సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



షూస్ పంపిణీ చేస్తున్న బూడిద రామ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి షూ పంపిణీ చేశారు. ఇటీవల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులకు షూస్ అందజేస్తామని బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా ఆయన చెప్పారు. మాట ప్రకారం విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గీతా నర్సింహ

ఆమనగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పల్లె జంగయ్యగౌడ్, పస్పుల శ్రీశైలంతో కలిసి ఆమె ప్రారంభించారు. కొనుగోలుకు తీసుకువచ్చిన పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సీపీవో రాజీవ్, మిల్లు యజమాని ఎన్.వంశీ, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ షఫీ, కుమ్మరి సత్యం, తిరుపతిరెడ్డి, జంగారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాదాసి కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వండి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాదాసి, మాదారి కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్లను ఇవ్వాలని మాదాసి కురుమ సంక్షేమ సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు సిందం విఠలయ్య కోరారు. ఈమేరకు గురువారం ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మాదాసి, మాదారి కులస్థులను ఎస్సీ జాబితాలో చేర్చి, ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నష్టపోతున్నామన్నారు. ఆ సంఘం నాయకులు కోరే రాజు, గొరిగే అర్జున్, బండ కుమార్, బాల్‌రాజ్, రంగయ్య, ఈశ్వరయ్య, కేశవ కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు/చౌదరిగూడ : మాదాసి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని కొందుర్గు మాదాసి కురువ సంఘం సభ్యులు తహసీల్దార్ ఆజంఅలీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం గుర్తించిన కులం మాదాసి కురుమ, మాదారి కురుమలు ఎస్సీ జాబితాలో ఉన్నాయన్నారు. అధికారులు మాదాసి కురుమలను బీసీల జాబితాల్లో విలీనం చేసి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. మాదాసి కురుమ సంఘం సభ్యులు కొయ్యల నర్సింలు, మల్లయ్య, యాదగిరి, మల్లేష్, శేఖర్, జంగయ్య, రాంచంద్రయ్య, రాజు, రమేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : ఫరూక్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మాదాసి కురుమలు

కేశంపేట : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న మదాసి కురుమ, మదారి కురుమలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటూ తెలంగాణ మదాసి కురుమ, మదారి కురుమ సంక్షేమ సంఘం నాయకులు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రెవెన్యూ అధికారుల పొరపాటు వల్ల తమని బీసీల్లో చేర్చారని, దీనిపై జాతీయ ఎస్సీ కమీషన్‌ను ఆశ్రయించగా 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిందని, తహసీల్దార్‌కు విన్నవించారు. హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తే అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. వెంకటయ్య, శ్రీశైలం, మల్లేష్, నరేష్ కుమార్, పాండు, నర్సింలు, మహేష్ తదితరులు ఉన్నారు.

పోమాల్‌పల్లికి 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



మహేశ్వరం : ప్రొసీడింగ్స్ అందిస్తున్న కమిషనర్ వాణి

కేశంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని పోమాల్‌పల్లికి మరో 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుమగల్ల రమేష్ తెలిపారు. ఈమేరకు గురువారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయ, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, శ్రీనివాస్‌లు, రామచంద్రా రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, చంద్రయ్య, తిరుమలయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

మహేశ్వరం : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ 7, 8వ వార్డుల్లో గురువారం లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను ఆమె అందజేసి భూమి పూజ చేయించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. మున్సిపల్ మేనేజర్ సౌమిక్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : ప్రొసీడింగ్ అందిస్తున్న అధికారులు, నాయకులు

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి

మహేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలు జరిగేలా చేసేందుకు వైద్యులు ప్రాధాన్యత ఇవ్వాలని అవేర్ మాధవన్‌జీ హాస్పిటల్ వైద్యురాలు హిమబిందు అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు రెవెన్యూ పరిధిలో గల అవేర్ మాధవన్‌జీ హాస్పిటల్‌కు ప్రసవానికి వచ్చిన ఓ మహిళకు ఆపరేషన్ చేయకుండానే సాధారణ ప్రసవం చేశారు. మొదట కాన్పు ఆపరేషన్‌తో కాగా.. రెండోసారి సాధారణ ప్రసవం చేశామని ఆమె తెలిపారు.



సాధారణ ప్రసవం చేసిన డాక్టర్ హిమబిందు

ఆడబిడ్డ పెళ్లికి పుస్తె, మెట్టెలు వితరణ

కేశంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొంగరి చెన్నయ్య-అనిత దంపతుల కూతురు నందిని వివాహం గురువారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్ గౌడ్ నందిని తల్లిదండ్రులకు పుస్తె, మెట్టెలను అందించారు. పేదింటి ఆడపిల్ల పెళ్లికి తన వంతుగా పుస్తె, మెట్టెలు ఇవ్వడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, కానం ఉదయ్ గౌడ్, సాయి గౌడ్, శివ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీ మన్యంకొండ హనుమద్దాసు నాటకం



హనుమద్దాసు పాత్రలో గుంపుల సుదర్శన్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తర రామేశ్వరంగా ప్రసిద్ధిగాంచిన రామేశ్వరం పుణ్యక్షేత్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన మన్యంకొండ హనుమద్దాసు చారిత్రాత్మక పౌరాణిక పద్య నాటక ప్రదర్శన భక్తులను అలరించింది. పౌర్ణమి రంగస్థల ప్రకాశనమ్ వ్యవస్థాపకుడు జేఎస్వీ శివప్రసాద్, రంగక్షేత్ర-రంగస్థల కళల విద్యాలయం, హైదరాబాద్ నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మన్యంకొండ హనుమద్దాస్‌గా గుంపుల సుదర్శన్ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు. ప్రతి పౌర్ణమి రోజు ఒక నాటక ప్రదర్శనను నిర్వహిస్తూ, ప్రజల రంగస్థలంపై ఆసక్తిని కల్గిస్తున్నారు. కార్యక్రమంలో వి.రమేష్‌చారి, వి.పురుషోత్తంచారి, బి.నారాయణస్వామి, గుంపుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.